ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 7 | మార్చి 2026

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

రాముడు ధర్మస్వరూపుడు .......................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 5

శ్రీమద్భగవద్గీత .................................. 17

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



మనస్సుని మనం పలచబడేటట్టు చేసుకోవటమే సాధన. మనోనాశనం అయ్యేవరకు ఏదో ఒక ప్రయత్నం చేస్తూనే ఉండాలి. దానినే ఉపాసన అంటారు.



# రాముడు ధర్మస్వరూపుడు

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

రాముడు ధర్మస్వరూపుడు. ధర్మమే రాముడి రూపం ధరించింది అని మనుషులు చెప్పలేదు, దేవతలు చెప్పలేదు, రాక్షసుడు చెప్పాడు. ఈమాట మారీచుడు చెప్పాడు, అదీ ఆశ్చర్యం. మారీచుడు రావణాసురుడికి మేనల్లుడు. నువ్వు దొంగ లేడి వేషం వేసుకొని వెళ్ళమని పురమాయించాడు రావణాసురుడు. అప్పుడు మారీచుడు చెపుతాడు – రాముడు అంటే సామాన్యుడు కాదు. నేను రాముడి చేతికి ఒకసారి దొరికాను. నన్ను చంపటం మానేసి, ఒక బాణం వేసి కొడితే ఒక్క దెబ్బకి ఎక్కడో సముద్రంలో వెళ్ళి పడ్డాను. రాముడు ధైర్యవంతుడు, సాహసవంతుడు, వీర్యవంతుడు. ఎంత వీర్యవంతుడు అంటే, మిమ్మల్ని రాముడు చంపాలంటే ఆయుధాలు అక్కరలేదు. ఊరికే చేతితో ముట్టుకుంటే చచ్చిపోతారు. అంత బలవంతుడు. చెట్టుని ఒకసారి ఊరికే ఇలా అంటే చాలు, పడిపోతుంది. రంపాలు అక్కరలేదు. అంత బలవంతుడు అని చెపుతూ... రాముడు ధర్మస్వరూపుడు, ధర్మమే శరీరం ధరించి రాముడిగా జన్మించింది, రాముడంటే ధర్మమే, వాడి జోలికి మనము వెళ్ళటం మంచిది కాదని రావణాసురుడికి మారీచుడు చెప్పాడు. రాముడు మహాత్ముడు, మహా బలవంతుడు. ధర్మ స్వరూపుడు, అధర్మం ఎలా ఉంటుందో తెలియదు రాముడికి అని దేవతలు చెప్పింది కాదు, మనుషులు చెప్పింది కాదు, ఋషులు చెప్పింది కాదు, మారీచుడు చెప్పాడు రామాయణంలో. రాముడు ధర్మస్వరూపుడని ఒక ఋషి చెపితే అది వేరే విషయం, ఒక రాక్షసుడు నోటివెంట చెప్పిన మాట ఇది.

రాముడు ధర్మస్వరూపుడని అంటున్నారు కదా, మరి మన మాట ఏమిటని మీకు అనుమానం రావచ్చు.  మనం బొత్తిగా చెడిపోయి ఉన్నామా? మనం చెడిపోయి లేము, ఎంతోకొంత మనమూ ధర్మాన్ని ఆచరిస్తున్నాము.  ధర్మం అంటే ఇక్కడ దానం అని కాదు. మనస్సుని కంట్రోల్ చేసుకొని, ఇంద్రియాలని కంట్రోల్ చేసుకొని, మనస్సుని నిదానం చేసుకొని, అధర్మం వైపుకి, అన్యాయం వైపుకి వెళ్ళకుండా, జీవితం పొడుగునా, న్యాయంగా జీవించటం అది ధర్మం అంటే.  ధర్మం అంటే జీవిత విధానం.  దానాలు అవీ వేరు.  కొన్ని వందల మందిలో ఎవరో ఒకడు వీరుడు పుడతాడు.  కొన్ని వేలమందిలో ఒకడు పండితుడు పుడతాడు.  కొన్ని లక్షలమందిలో కాని దాతృత్వం ఉన్నవాడు పుట్టడని శాస్త్రంలో ఉంది. దానానికి పేరు కర్ణుడిది.  ఇక్కడ దానం గురించి కాదు.  ధర్మం అంటే ఒక జీవిత విధానం.  అయితే మనం కూడా ధర్మం ఆచరించటం లేదా, మనం చెడిపోయామా అంటే, మనం ఎంతో కొంత మంచి వాళ్ళమే, బొత్తిగా పాడైపోలేదు మనము.  మనం కూడా ఎంతోకొంత ధర్మాన్ని ఆచరిస్తున్నాము.

అయితే మనకీ రాముడికీ తేడా ఏమిటంటే, మనకి ఏదైనా భయం వేసింది అనుకోండి, ధర్మాన్ని వదిలేస్తాము.  మనని ఎవరైనా బెదిరించారు అనుకోండి, – ఇప్పుడు ఎలక్షనులలో జరిగేది అంతే.  ఎలక్షన్‌లు జరిగినప్పుడు, మీరు వాళ్లకి ఓటు వేస్తే మిమ్మల్ని జైలులో పెట్టేస్తాము, మీమీద కేసులు ఉన్నాయి, అవన్నీ బయటికి తీస్తాము అని అలా బెదిరిస్తుంటే వాళ్ళు జడుస్తున్నారు.  రాముడు అలా జడవడు.  అంటే, మనకీ రాముడికీ తేడా ఏమిటంటే, మనమూ ధర్మాన్ని ఆచరిస్తాము కాని మనకి భయం వేస్తే ధర్మాన్ని వదిలేస్తాము.  రాముడు ఎట్టి పరిస్థితులలోనూ  వాడికి ప్రాణం పోయినా ధర్మాన్ని విడిచిపెట్టడు, వాడు రాముడు!

మనం ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటాము.  మనకి ఎవరైనా ఏదైనా ఆశ పెట్టారు అనుకోండి, ఎందుకొచ్చిన ధర్మం అని ఎవరైనా ఆశ పెడితే ఆ ఆశ కోసం ధర్మాన్ని విడిచిపెట్టేస్తాము.  ఎవరూ ఆశ పెట్టకపోయినా, మనని ఎవరైనా భయపెట్టారు అనుకోండి, మీరు ఇలా ఉంటే మీమీద ఏదో కేసులు పెట్టిస్తాము, లేకపోతే మీ సరిహద్దులలో వాళ్ళ చేత దావాలు చేయిస్తాము మీమీద, ఇలా అనేవాళ్ళు చాలామంది ఉంటారు.  ఆ భయం వల్ల

కూడా మనం ధర్మాన్ని విడిచిపెట్టేస్తాము.  కోరిక వల్ల కాని, భయం వల్ల కాని, ఇతరులు ఎవరో మనకి నష్టం తెచ్చిపెట్టేస్తారు అని ఈ రకంగా అనుమానాలు పెట్టుకోవటం వల్ల కాని మనం ధర్మాన్ని వదిలేస్తాము.  ధర్మంగా జీవిస్తున్నాము, కాని మనకి ఏమీ కలిసిరావటం లేదు అనుకొనేవాళ్ళు కూడా ధర్మాన్ని వదిలిపెట్టేస్తున్నారు.

కైకేయి దశరథుడితో భరతుడిని పట్టాభిషిక్తుడిని చేయమంది, రాముడిని పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి పంపాలి అంది.  అప్పుడు రాముడితో లక్ష్మణుడు చెప్పాడు ధర్మాన్ని విడిచిపెట్టమని.  అంటే పితృవాక్య పరిపాలన చేయవద్దు అని.  అప్పుడు కూడా ఎట్టి పరిస్థితులలోనూ ధర్మాన్ని విడిచిపెట్టను అని రాముడు చెప్పాడు.  ఎందుచేతనంటే, రాముడు వేరు ధర్మము వేరు కాదు.  ధర్మమే రాముడి స్వరూపంగా జన్మించింది.  అది మనకి రాముడికి తేడా.  రాముడు వేరు, ధర్మము వేరు కాదు.  రాముడు అవతార పురుషుడే, కృష్ణుడు అవతారపురుషుడే.  అయితే మన మనస్సుకి, మన ఇంద్రియాలకి, మన బుద్ధికి కృష్ణుడు అందడు.  రాముడు మనకి దగ్గరగా ఉంటాడు, మన కష్టసుఖాలకి అందుతాడు. మనకి అందని దేవుడు కృష్ణుడు, మనకి అందే దేవుడు రాముడు.

రాముడిని అరణ్యవాసానికి పొమ్మన్నారు, రాజ్యం భరతుడికి ఇమ్మన్నారు.  ఇన్ని కష్టాలలో కూడా రాముడు ధర్మాన్ని విడిచిపెట్టలేదు.  నేను కైకకి వరం ఇచ్చిన మాట నిజమే, ఒకవేళ కైక నిన్ను అరణ్యవాసానికి పొమ్మన్నా నువ్వు వెళ్లొద్దు అని దశరథుడు చెప్పాడు.  కాని అప్పుడు కూడా రాముడు అంగీకరించలేదు.  ఇంతకీ మనని ఎవరైనా నష్టపరిస్తే మనం చనిపోయేవరకూ వాళ్ళ మీద కోపంగా ఉంటాము.  రాముడికి కైక మీదకాని దశరథుడి మీదకాని కించిత్తు కూడా ఎవరిమీద ఆగ్రహం కలుగలేదు.  మనకి కోపం వస్తే ధర్మాన్ని విడిచిపెట్టేస్తాము.  ఎందుకండీ మీ ధర్మం మిమ్మల్ని ఏమి కాపాడింది అని ఎవరైనా మనల్ని అంటారు అనుకోండి సడన్‌గా ధర్మాన్ని విడిచిపెట్టేస్తాము.  రాముడు అలా చెప్పుడు మాటలు విని ఎప్పుడూ ఎక్కడా ధర్మాన్ని విడిచిపెట్టలేదు, వాడు రాముడు – అందుకే ఆయన దేవుడు అయ్యాడు!

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 30 జూన్ 1996, గుండుగొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భక్తి కూడా గుట్టుగా ఉండాలి అనేవారు భగవాన్. మీకు బ్యాంక్‌లో ఎంత డబ్బు ఉంది అని అడుగుతాను అనుకోండి, మీరు ఎవరైనా చెపుతారా? అక్కడ ఇన్‌కంటాక్స్ ఆఫీసర్లు ఎవరూ లేకపోయినా మీ దగ్గర డబ్బు ఎంత ఉంది అంటే ఎవ్వరూ చెప్పరు. కానీ భక్తి గురించి మటుకు చెప్పేస్తారు, మేము రోజు విష్ణుసహస్రనామాలు చదువుతున్నాం, లలితా సహస్రనామాలు చదువుతున్నాం, తెల్లవారుజామున మూడు గంటలకి నిద్రలేస్తున్నాం, ధ్యానం చేస్తున్నాము అని చెప్పేస్తారు, మీ దగ్గర డబ్బు మటుకు ఎవ్వరూ చెప్పరు. మీ దగ్గర డబ్బు గుట్టుగా ఉండాలి అనుకుంటారు, మీ భక్తి అందరికీ తెలిసిపోవాలి అనుకుంటారు. ఇది చెడ్డది అంటున్నారు భగవాన్. మీ భక్తి కూడా గోప్యంగా ఉండాలి. అంటే అందరికీ తెలిసిపోవాలి అనుకోకూడదు. అందరికీ తెలిసిపోవాలి అని మీరు అనుకుంటారు అనుకోండి మీకు భక్తి పెరగదు, అహంకారం పెరుగుతుంది, ఇది ఇక్కడ రహస్యం. నేను విష్ణుసహస్రనామాలు రోజూ పారాయణ చేసుకుంటున్నాను, అది ఈ ఊర్లో అందరికీ తెలిసిపోవాలి అని మీరు అనుకుంటున్నారు అనుకోండి, ఆ విష్ణుసహస్రనామాల పారాయణ వల్ల మీకు వచ్చే పుణ్యం ఐదు పైసలు అయితే 95 పైసలు అజ్ఞానం పెరుగుతుంది. ఇంతకీ మీరు చేస్తున్నది ప్లస్సా, మైనస్సా మీకు? అంటే దానికి రాణింపు లేదు. మీరు చేసే పని ఎలా ఉండాలి? గుప్తంగా ఉండాలి. అంటే భక్తి కూడా ఎంత రహస్యంగా ఉంటే అంత మంచిది అని రమణమహర్షి గారు చెప్పేవారు.

అసలు మనకున్న భక్తి పక్కవాళ్ళకి తెలియాలి అని మనం అనుకోవడం ఎందుకు? ఇప్పుడు మీకు ఎంత డబ్బు ఉందో మీరు పక్కవాళ్ళకి చెబుతున్నారా? యజమానులు ఉన్నారు అంటే అసలు కోడళ్ళకి కూడా తెలియనివ్వరు, కూతుళ్ళకి కూడా ఎంత డబ్బు ఉందో వాళ్ళకి తెలియనివ్వరు కాని భక్తి మటుకు అందరికీ తెలియపరుస్తూ ఉంటారు. మీ

డబ్బు మీరు ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నారో, ఎంత గుప్తంగా చూసుకుంటున్నారో మీ భక్తి కూడా అంత రహస్యంగా చూసుకోండి. అంటే భక్తి రహస్యంగా ఉంచడం వలన అది అభివృద్ధి పొందుతూ ఉంటుంది. Advertisement కనుక మీరు చేసుకుంటూ ఉంటే భక్తి తగ్గిపోతూ ఉంటుంది, అహంభావన పెరుగుతూ ఉంటుంది.

ఇక్కడ ఆచార్యస్వాములవారు ఏమి చెబుతున్నారు అంటే నీకు శత్రువు ఎవరు అంటే నీ అహంభావనే నీ శత్రువు. ఆత్మకి శత్రువులు ఎవరూ లేరు, అహంభావనే శత్రువు. ఆత్మ అంటే ఎవరు? మీరే, మరల ఇది మర్చిపోకండి కానీ ఇదే మర్చిపోతున్నారు అందరూ, మీకు శత్రువు ఎవరు? మీ అహంభావనే మీకు శత్రువు. అది తప్పించి ఇంక శత్రువులు ఎవరూ లేరు. ఎందుచేత అంటే దానివల్ల మాత్రమే నీకు బ్రహ్మానుభవం రావడం లేదు. ఒక్క అహంభావం వలన మాత్రమే నీ హృదయంలో ఉన్న బ్రహ్మం నీకు అనుభవంలోకి రావడం లేదు. మీకు శత్రువులు ఎవరూ బయట లేరు, మీ శత్రువులు బయట ఉన్నారు అని మీరు అనుకుంటున్నారు. బాహ్యంగా మీకు శత్రువులు లేరు, మీ లోపలే మీకు శత్రువు ఉన్నాడు. వాడు ఎలా ఉన్నాడు అంటే అహంభావన రూపంలో ఉన్నాడు. ఆత్మ అంటే ఎవరు? మీరే, ఆత్మ మీరు అయినా మీకు ఆత్మానుభవం రావడం లేదు. అలా రాకుండా చేసేది ఎవరు? అహంభావనే. అందుచేత మీకు ఎవరు శత్రువు అంటే అహంభావనే శత్రువు. ఆ పొందిక చూడండి, ఆ చెప్పే సంస్కారం చూడండి. Beautiful presentation, wonderful presentation, ఆ presentationలో ఉన్న అందాలు చూడండి. ఆత్మ అంటే ఎవరు? మీరే. మీ శత్రువు బయట ఎవరూ లేరు, మీ అహంభావనే మీకు శత్రువు. ఎందుచేత మీ అహంభావన మీకు శత్రువు? అంటే మీరు ఎవరో మీకు తెలియకుండా ఈ అహంభావనే అడ్డు వస్తోంది కాబట్టి, మీలో ఉన్న సుఖాన్ని పొందకుండా ఈ అహంభావనే మీకు అడ్డు వస్తోంది కాబట్టి, మీకు ఎవరు శత్రువు? మీ అహంభావనే మీకు శత్రువు అని చెప్పి అక్కడ ఆగడం లేదు. ఇంకా ఏమని చెపుతున్నారు అంటే కంట్లో నలుసు ఉంది అనుకోండి, కాళ్ళలో ముల్లు ఉంది అనుకోండి, మనిషిని ఎలా బాధిస్తు ఉంటాయో, శరీరానికి

ఏదైనా cancer జబ్బు ఉంది అనుకోండి, ఆ cancer జబ్బు ఎలా బాధిస్తూ ఉంటుందో, ఈ అహంభావన కూడా మనిషిని నిరంతరం అలా బాధపెడుతూ ఉంటుంది. కొంతమంది జరిగిపోయినవి తలపెట్టుకుంటూ ఉంటారు. ఇంటి దగ్గర ఇంక సాధన చెయ్యరు. జరిగిపోయిన గొడవలు ఉంటాయి కదా, వాళ్ళు కొట్టినారు, వీళ్ళు తిట్టినారు, వాళ్ళు ఇలా అన్నారు, వీళ్ళు అలా అన్నారు, మా తోటి కోడలు ఇలా అంది, మా అత్తగారు అలా అంది అని జరిగిపోయిన గొడవలు అన్నీ తలపెట్టుకుంటూ ఉంటారు. ఈ అహంకారం దానిని అది చంపుకోవడానికి ఇష్టపడదు. నిరంతరం దేవుడిని స్మరిస్తే ఈ అహంభావన యొక్క వేరు ఊడిపోయే ప్రమాదం ఉంది. అందుచేత అది ఏమి చేస్తుంది అంటే వారు ఇలా అన్నారు, వారు కొట్టినారు, వీరు తిట్టినారు అని జరిగిపోయిన గొడవలు అలా తలపెట్టుకుంటూ అది పెరిగిపోతూ ఉంటుంది. కొంతమందికి పని పాటా ఉండదు, భోజనం నాలుగు మెతుకులు తినేశాక రామా, కృష్ణా అనుకోరు, ఎంతసేపు వారు కొట్టినారు, వీరు తిట్టినారు, అని జరిగిపోయిన గొడవలు అన్నీ తలపెట్టుకుంటూ ఉంటారు. అది మాయ అన్న సంగతి వాళ్ళకి తెలియడం లేదు. మాయ అంటే ఏమీ లేదు, అదే మాయ. కొంతమంది జరిగిపోయిన గొడవలే తలపెట్టుకుంటూ కూర్చుంటారు, చేతిలో ఉన్న కాలాన్ని వదిలేస్తూ ఉంటారు, ఈలోపు చావు దగ్గరకి వచ్చేస్తుంది. చావు దగ్గరకి వచ్చేసిన తరువాత కొంత టైము ఇమ్మంటే టైము ఇవ్వదు. ఒక్కరోజు ఆగవయ్యా అంటే టైము ఇవ్వదు.

ఇక్కడ ఏమంటున్నారు? కాళ్ళలో ఉన్న ముల్లు ఎలా బాధపెడుతుందో, కంట్లోనలుసు ఎలా బాధపెడుతుందో, నీకు దేహానికి ఏదైనా రోగం వచ్చినప్పుడు ఆ రోగం దేహాన్ని ఎలా పీడించేస్తుందో, అలాగే అహంభావం, అజ్ఞానం నిన్ను పీడించేస్తుంది. నీ దుఃఖానికి కారణం అదే, నీ tensionsకి కూడా కారణం అదే, అది నిన్ను పీడించేస్తుంది. కాలులో ముల్లు ఉంది అనుకోండి, మనం ఏమి చేస్తాము? ఇంకొక ముల్లు తోటి దానిని తీసేసుకుంటాం. మీకు అర్థం అవుతోందా? అంతగా రాకపోతే హాస్పిటల్‌కి వెళ్ళి, ఆపరేషన్ చేయించేస్తాం. పైపైన అయితే మనం తీసేసుకోవచ్చు కానీ ఒకో ముల్లు బాగా లోతుకి వెళితే హాస్పిటల్‌కి

తీసుకెళ్ళవల్సిందే, పైన చమురు రాస్తే పోదు. ఈ అహంభావన మనకు అంత లోతుగా దిగిపోయి ఉంది. ఊరికే పైన చమురులు రాస్తాం, ointmentలు రాస్తాం అంటే ఇది పోదు దానికి సర్జరీ పడవలసిందే. ఎలాగైతే డాక్టరు కత్తి ఉపయోగించి ఆ ముల్లు తీసేస్తున్నాడో ఒకవేళ లోతుగా దిగినప్పటికీ, అలాగే ఇక్కడ ఏమి చెయ్యాలి అంటే ఈ అహంకారం అనే ముల్లుని ఎలా తియ్యాలి అంటే మీ వివేకం అనే కత్తి తోటి తియ్యాలి. బాహ్యమైన కత్తులు దీనికి పనికిరావు, బాహ్యమైన instruments దీనికి పనికిరావు, బాహ్యమైన ప్రవృత్తి దీనికి పనికిరాదు. నీ వివేకం అనే కత్తి తోటి ఈ ముల్లుని బయటకి తియ్యాలి. వివేకం అంటే నిశ్చయ జ్ఞానం. ఇది అవునా, కాదా, దేవుడు ఉన్నాడా? లేడా? ఇలా wavering ఉంటే మీరు ఆ ముల్లు తియ్యలేరు.

మీరు కాళ్ళ తోటి ఏవిధంగా అయితే నడుస్తున్నారో, చేతుల తోటి ఏవిధంగా అయితే పని చేస్తున్నారో, అలా మెదడు తోటి ఆలోచించుకోండి. ఆలోచించుకోకపోతే ఆ మెదడు ఎందుకు మీకు? మీ బాగు మీరు చూసుకోండి, మీ భవిషత్తు మీరు చూసుకోండి. మీకు వివేకం లేకపోతే, ఆ తెలివి లేకపోతే మీరు బాగుపడడానికి అవకాశం లేదు. భౌతికమైన అభివృద్ధికైనా, పారమార్థికమైన అభివృద్ధికైనా వివేకం అవసరం, Discrimination అవసరం. ఆచార్యుల వారు ఇక్కడ చెప్పలేదు కానీ మరొక సందర్భంలో చెప్పారు. మనకి ఎప్పుడైనా కడుపు నొప్పి వచ్చినప్పుడు వైరాగ్యం వస్తూ ఉంటుంది. ఎవరైనా చనిపోయినప్పుడు అయ్యో చనిపోయారు, మనం కూడా ఎప్పటికైనా ఇలా అయ్యిపోతాం కదా అని శవాలను చూసినప్పుడు వైరాగ్యం వస్తుంది. కడుపు నొప్పి వచ్చినప్పుడు ఏమీ తినకూడదు, జాగ్రత్తగా ఉండాలి అనుకుంటాం సాయంత్రం వరకు, మరుసటి రోజున మామూలుగా మన చనివిడి మనదే. మన తిండి మనదే. ఈ వైరాగ్యాలు ఎంతకాలం నిలబడతాయి, కడుపు నొప్పి వచ్చినప్పుడు, కాలు నొప్పి వచినప్పుడు, ఇంట్లో మీ ఆయన తిట్టినప్పుడు ఈ వైరాగ్యాలు ఎంతోకాలం నిలబడవు. వివేకం లోంచి పుట్టుకని రావాలి వైరాగ్యం. ఈ కబుర్లకి, ఈ కాకరకాయలకి ఏమిటి అంటున్నారు ఆచార్యస్వాములవారు.

ఆచార్యస్వాములవారు ఏమంటున్నారు అంటే, నీకేదో తలకాయ పోటు వచ్చిందని, కడుపు నొప్పి వచ్చిందని ఈ వైరాగ్యం ఎక్కడ నిలబడుతుంది. మీ ఆయన ఇంటికెళ్ళినప్పుడు తిట్టారు అనుకోండి, ఆ పది నిమిషాలు మంచి వైరాగ్యం వచ్చేస్తుంది. మీకు అర్థం అవుతోందా? ఇంట్లోంచి వెళ్లిపోదాము, పరిత్యాగం చేసేద్దాం అనిపిస్తుంది. ఇవి నిలబడే వైరాగ్యాలు కాదు, ఇవి నిలబడే టికెట్లు కాదు, దీనివల్ల మీకు జ్ఞానం రాదు. ఎందులోంచి వైరాగ్యం రావాలి అంటే వివేకం నుంచి వచ్చిన వైరాగ్యం నిలబడుతుంది కానీ, ఇంట్లో మీ అత్తగారు తిట్టారు అని, మీ ఆయన తిట్టారు అని ఎప్పుడైనా వైరాగ్యం వచ్చినా, ఆ వైరాగ్యం వల్ల కొంపతీసి మీకు జ్ఞానం వస్తుంది అనుకుంటారేమో, రాదు రాదు అంటున్నారు ఆచార్యస్వాములవారు. వైరాగ్యం ఎందులోంచి రావాలి? వివేకం లోంచి రావాలి. అన్ని కోరికలు వదిలేయ్. నువ్వు అన్ని సంస్కారాలు, అన్ని కోరికలు, అన్ని తలంపులు మూటకట్టేసి ఒక పక్కన పెట్టు, కానీ మోక్షం పొందాలి, ఆత్మానుభవం పొందాలి అనే కాంక్ష విడిచిపెట్టకు. ఆచార్యుల వారు ఏమంటున్నారు అంటే, మోక్షకాంక్ష మటుకు విడిచిపెట్టకు అంటున్నారు. మోక్షకాంక్ష విడిచిపెట్టకుండా ఉంటే, ఆ కాంక్ష మిమ్మల్ని ఎక్కడకి తీసుకుని వెళ్తుంది అంటే bliss లోకి తీసుకుని వెళ్తుంది, happiness లోకి తీసుకుని వెళ్తుంది, పీస్‌లోకి తీసుకుని వెళ్తుంది. మోక్షసుఖం, మోక్షశాంతి ఎలా ఉంటుంది, ఎలా ఉంటుంది అని ఇప్పటినుంచి ఊహించుకోకండి, అది వచ్చాక మీకు తెలుస్తుంది అందులోని వైభవం. మోక్షసుఖం మనం ఇంతవరకు పొందలేదు. ఆ మోక్షసుఖం ఎలా ఉంటుందో ఊహించుకోవద్దు. అది వచ్చాక మీకు తెలుస్తుంది. మీరు ఊహించుకుంటే, మీ సంకల్పాలే, మీ తలంపులే మళ్ళీ ఆ సుఖం మీకు అందకుండా అడ్డువస్తాయి. అది ఊహించుకునేది కాదు, అది అనుభవించేది,



**భగవంతుడు సర్వజ్ఞుడు, అంతటా వ్యాపించి ఉన్నాడు. మీకు వచ్చే కష్టాలు భగవంతుడికి తెలియకుండా రావటం లేదు.**

అది మీ అనుభవంలో తెలుస్తుంది. మీరు అందరూ మోక్షసామ్రాజ్యానికి అధిపతులు కండి, మోక్షసామ్రాజ్యానికి చక్రవర్తులుకండి, మోక్షసామ్రాజ్యం నుండి ఆ శాంతిని, ఆ సుఖాన్ని శుభ్రంగా ఎంజాయ్ చెయ్యండి మీరు. అంటే ఆ మోక్షసుఖం మీకు వచ్చినప్పుడు దాని తాలూకు ఆనందం, శాంతి ఎంజాయ్ చెయ్యండి. మోక్షం పొందాలి అనే కాంక్ష విడిచిపెట్టకండి.

మీకు బాగుపడాలి అనే కాంక్ష వస్తే నాలుగు సంవత్సరాలు వెనకో, ముందో మీరు బాగుపడతారు. మీరు కష్టపడి చదువుకుని అభివృద్ధిలోకి రావాలని కాంక్ష వస్తే మీరు అభివృద్ధిలోకి వస్తారు. లోపల నుంచి, హృదయాంతరాళాల్లోంచి మనం ఆ వస్తువుని పొందాలి అనేటటువంటి కాంక్ష మీకు రావాలి, వస్తే మీరు బాగుపడినట్టే. రైలు ఎక్కి కూర్చుంటే, నాలుగు గంటలు వెనకో, ముందో ఒకవేళ లేట్ అయినా మనల్ని destinationలో పడేస్తుంది. అదేవిధంగా జ్ఞానం సంపాదించాలి అనే కాంక్ష, ఆ ముముక్షత్వం కనుక మీకు వస్తే మీరు తప్పనిసరిగా మోక్షాన్ని పొందుతారు. ఆ మోక్షకాంక్ష కనుక మీకు ఉంటే తప్పనిసరిగా మీరు మోక్షాన్ని పొందుతారు. ఎంతో పూర్వ పుణ్యం ఉంటేనే కానీ ఆ కాంక్ష రాదు. కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే బహుజన్మల కృషి వల్ల కానీ ఆత్మజ్ఞానం కలగదు అన్నాడు. అనేక జన్మలలో వాడు చేసిన కృషి వల్ల, మనిషి ఋషి అవుతాడు.

మీరు కూడా రమణమహర్షిలా అవ్వవచ్చు, రమణమహర్షి గారి సొంతం ఏమీ కాదు ఆత్మ సామ్రాజ్యం. ఆత్మానుభవం అనేది రామకృష్ణ పరమహంసకి, రమణమహర్షికి సొంతం ఏమీ కాదు. మనిషి ఎవడైతే హృదయపూర్వకంగా కృషి చేశాడో వాడు ఋషి అవుతాడు. వాడు దేనివల్ల అవుతున్నాడు? కృషి వల్ల అవుతున్నాడు. ఇలా చెబుతుంటే కొంతమంది భగవాన్‌ని ఏమన్నారు అంటే, మీరు చెప్పడానికి ఏమిటి కబుర్లు అందరూ తేలికగా చెబుతారు, మేము ఎన్నో బాధలు పడుతున్నాం, ఎన్నో కష్టాలు పడుతున్నాం, మాకు ఇంకా ఏమీ తెలియడం లేదు, మీరు ఏమీ సాధన లేకుండా, ఏమీ బాధలు లేకుండా ఆత్మానుభవం పొందారు అన్నారు. ఇప్పుడు మీరేమి కష్టపడలేదు, మన పురాణాల్లో తపస్సులు

చేసినట్టు మీరు ఎక్కడా తపస్సులు చెయ్యలేదు. మధుర నుంచి పారిపోయి వచ్చి అరుణాచలంలో కూర్చున్నారు. మీరు కొన్ని గంటల టైములో ఋషి అయిపోయారు, ఇంటి దగ్గరే మీకు మరణానుభవం వచ్చింది ఋషి అయిపోయారు, ఆ మరణానుభవం కూడా మీరు కావాలని తెచ్చుకోలేదు. ఏదో దేవ రహస్యం. ఏ దేవతలో మిమ్మల్ని అనుగ్రహించారు, ఆ మరణానుభవం వచ్చింది, కొన్ని నిమిషాలలో మహర్షి అయ్యి కూర్చున్నారు. మేము పడే బాధలు మీకు ఏమి తెలుస్తాయి, మేము కళ్లు మూసుకుంటున్నాం, ముక్కు మూసుకుంటున్నాం, నామం చేసుకుంటున్నాం, తెల్లవారుజామున మూడు గంటలకి లెగుస్తున్నాం, నదుల్లో మునిగి వస్తున్నాం, దేవతా విగ్రహాలని ఆరాధిస్తున్నాం, సత్యనారాయణ వ్రతాలు చేసుకుంటున్నాం, పూజలు చేసుకుంటున్నాం, నానా రకాలు మేము సాధనలు చేసుకుంటూ ఉంటే మాకు ఎక్కడా ఒడ్డు కనపడడం లేదు. మేము పడ్డ కష్టం ఏమీ లేకుండా అది మీకు వచ్చేసింది. అందుచేత మీరు కబుర్లు తేలికగానే చెబుతున్నారు అని భగవాన్‌తో అన్నారు. అలా ఎవరైనా మాట్లాడితే మనకి కోపం వస్తుంది. కాని భగవాన్ "అలా కాదు, ఇప్పుడు మీరు ఏది అయితే కష్టం అనుకుంటున్నారో ఆ కష్టాలు నేను పూర్వజన్మలో పడి ఉంటానేమో" అన్నారు. ఎంత బాగా చెప్పారో చూడండి. ఆయన కోపం తెచ్చుకోలేదు సరికదా ఇప్పుడు మీరు అందరూ ఏ కష్టాలు అయితే పడుతున్నాం, పడుతున్నాం అని అనుకుంటున్నారో, అది నేను పూర్వజన్మలో పడి ఉండవచ్చు అని చెప్పారు. అయ్యా, మీ కళ్ల ఎదురుగా పడాలని ఏమీ లేదు, ఇటువంటి శరీరాలు ఎన్ని మారిపోయాయో, ఇప్పుడు ఏ కష్టం అయితే మీరు పడుతున్నాం అనుకుంటున్నారో ఆ కష్టం నేను పూర్వజన్మలో పడి ఉండవచ్చు, పడకుండా నాకు రాదు అన్నారు. అంటే జ్ఞానాన్ని సంపాదించు, ఆత్మవిద్యని సంపాదించు, నీకు అమృతస్థితి కలుగుతుంది, అమృతానుభవం కలుగుతుంది, ఆత్మానుభవం కలుగుతుంది, మోక్షశాంతి నీకు తెలుస్తుంది. రోగం రోగం అంటే శరీరానికి వచ్చే రోగం ఏముంది, స్మశానంలో శరీరం కాలిపోయినప్పుడు రోగాలు కూడా కాలిపోతాయి, శరీరం కాలిపోయాక ఏమైనా రోగాలు మిగులుతాయా? ఒక మనిషికి కేన్సర్ వచ్చింది అనుకోండి,

తగ్గలేదు అనుకోండి, ఆ శరీరాన్ని స్మశానంలో తగలేస్తారు. అప్పుడు కేన్సర్ కాలిపోతుందా? ఉంటుందా? శరీరంతో పాటు రోగాలు కూడా కాలిపోతాయి. కానీ ఏది దీర్ఘమైన రోగం అన్నారు ఆచార్యస్వాములవారు. రోగాలలో ఏది బాగా దీర్ఘమైన రోగం కేన్సర్ అని చెప్పలేదు ఆచార్యస్వాములవారు. మనిషికి దీర్ఘమైన రోగం, జన్మజన్మలకి కూడా వచ్చే రోగం ఏమిటి అంటే, సంసారం అని చెప్పారు ఆయన. రోగాలు అన్నిటిలోకి దీర్ఘరోగం సంసారం. సంసారం అనే రోగం జ్ఞానం వల్ల నశించవలసిందే కానీ మందులు మింగడం వలన నశించదు. అజ్ఞానం జ్ఞానం వల్ల నశిస్తుంది కాని కబుర్ల వల్ల, కాకరకాయల వల్ల నశించదు. అందుచేత నువ్వు జ్ఞానసముపార్జనకి ప్రయత్నం చెయ్యి, నీ కాలాన్ని వేస్ట్ చేసుకోవద్దు, నీ ఎనర్జీని నువ్వు వేస్ట్ చేసుకోవద్దు, జ్ఞానసముపార్జన కోసం కష్టపడి పనిచేసుకో అని చెపుతున్నారు.

బుద్ధుడు శరీరం విడిచిపెట్టేటపుడు బుద్ధుడు కోసం సవతి తమ్ముడు ఏడ్చాడు. అప్పుడు బుద్ధుడు ఏమన్నాడు Don't think for me, నా గురించి నువ్వు ఆలోచించకు. Don't weep for me, నా గురించి నువ్వు విలపించకు. నువ్వు తరించే ఉపాయం ఏదో నువ్వు చూసుకో, బుద్ధుడు చాలా గొప్పవాడు అయితే నీకు కలిసి వచ్చేది ఏమిటి? నువ్వు బాగుపడే విధానం చూసుకో, Don't think for me, don't weep for me. బుద్ధుడు చాలా గొప్పవాడు అని చెప్పుకోవడం వలన నీకు కలిసివచ్చేది ఏమిటి? ముందు నువ్వు తరించే ఉపాయం ఏదో నువ్వు చూసుకో. ఇక్కడ ఉందండి బుద్ధుడి గొప్పతనం. అయితే ఈ శరీరాన్ని ఏమి చెయ్యమంటారు అని తమ్ముడు అడిగాడు. కొంతమంది బ్రతికి ఉండగా ఆ శరీరం చనిపోయాక ఏమిచెయ్యాలో అంతా చెప్పేస్తారు. గౌతమబుద్ధుడి శరీరం పడిపోయేటప్పుడు తమ్ముడు ఏమన్నాడు అంటే మీ శరీరాన్ని ఏమి చెయ్యమంటారు ఎక్కడైనా కప్పెట్టి గుడి కట్టించమంటారా? ఏదో ఒకటి చెయ్యాలి కదా అని అడిగితే అప్పుడు బుద్ధుడు అంటాడు ఆయన ఎంత ఔన్నత్యం పొందాడో ఈ ఒక్కమాట చాలు. ఎంతసేపు మనకి పేరు గొడవ, గొప్పల గొడవ, రూపం, నామం. ఎన్నాళ్ళు బ్రతికినా ఈ రెండింటిలోంచి బయటకి

రాలేకపోతున్నాం మనం. రూపబుద్ధి, నామబుద్ధి. ఎన్ని వేల సంవత్సరాలు బ్రతికినా ఇందులోంచి బయటకి రాలేకపోతున్నాం. అప్పుడు బుద్ధుడు "ఇప్పుడు మనం ఉన్నది ఒక ఊరేనా?" అని అడిగాడు. ఆ సవతి తమ్ముడి పేరు ఆనంద్. మనం ఉన్నది ఏదో ఒక ఊరు. స్మశానం లేకుండా ఊరు ఉంటుందా? అన్నాడు బుద్ధుడు. ఊరికి ఏదో స్మశానం ఉంటుంది కదా, స్మశానం లేకుండా ఊరు ఉండదు కదా, అందరినీ ఏ స్మశానంలో తగలేస్తున్నారో ఈ శరీరాన్ని కూడా అక్కడే తగలేయండి, ఎక్కడ తగలేస్తే ఏముంది అన్నాడు. వాడు బుద్ధుడు. అంతేకానీ అక్కడ గుడి కట్టించండి, అక్కడేదో మార్కు పెట్టండి, చుట్టూరు తోట వేయండి, ఇటువంటి మాటలు ఏమీ చెప్పలేదు. అందరి లాగానే స్మశానానికి తీసుకుని వెళ్ళి ఈ శరీరాన్ని కూడా బర్న్ చెయ్యండి అని చెప్పాడు.

మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రాకపోవడానికి కారణం రూపబుద్ధి, నామబుద్ధి. ఈ దేహం ఏమిటిది? రూపం. ఈ రూపాన్ని ఉపయోగించుకుని, అహంకారం లోంచి విడుదల పొందడానికి మనం ప్రయత్నం చెయ్యాలి. దాని కోసం భగవంతుడు ఈ దేహాన్ని మనకి ఇచ్చాడు, ఈ రూపాన్ని ఉపయోగించుకుని, అంటే శరీరాన్ని ఒక నావ కింద ఉపయోగించుకుని, ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకి వెళ్ళమని, అందుకు ఈ శరీరాన్ని అసలు ఆయన ఇచ్చింది. దీనిని నావ కింద ఉపయోగించుకుని, ఈ వైపు నుంచి ఆవైపుకి వెళ్ళమని, దేహాన్ని ఎందుకు ఇచ్చాడు అంటే దేహాన్ని ఉపయోగించుకుని మోక్షాన్ని పొందమని ఇచ్చాడు కాని మనం ఏమి చేస్తున్నాం అంటే దేహాన్ని ఉపయోగించుకుని అహంకారాన్ని పెంచుకుంటున్నాం, ఇది ఇక్కడ ప్రమాదం. మన అహంకారం పెరగడానికి దేహం బాగా ఉపయోగపడుతోంది. మీకు ఒక దేహం ఉంది కదా, ఆ దేహాన్ని ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తుంది, ఆ దేహాన్ని ఎవరైనా విమర్శిస్తే, దుఃఖం వస్తుంది. సంతోషం అహంకారానికి మేతే, దుఃఖం కూడా అహంకారానికి మేతే, ఈ దేహం ఏది పెరగడానికి ఉపయోగపడుతోంది? అహంభావం పెరగడానికి నీ దేహం ఉపయోగపడుతోంది. అసలు భగవంతుడు మనకు దేహం ఎందుకు ఇచ్చాడు? నావ ఉపయోగించుకుని నదిని ఎలా

దాటుతారో అలా సంసారం అనే దీర్ఘరోగం నుండి బయటపడటానికి, అజ్ఞానం నుండి బయటపడటానికి ఈ దేహాన్ని ఉపయోగించుకుంటారు అని భగవంతుడు ఇస్తే మనం దీనిని బంధింపబడడానికి ఉపయోగించుకుంటున్నాం. అయితే చనిపోయాక మళ్ళీ జన్మ వచ్చేస్తుంది, అంటే ఒక రూపం వస్తుంది. ఇందులో రహస్యం ఏమిటి అంటే, అహంభావనకి రూపాలు ఫుడ్ సప్లై చేస్తాయి. మనిషికి అహంభావం పెరిగిపోవడానికి రూప బుద్ధే కారణం. రూపం వచ్చినప్పుడు ఆ రూపం తోటి వాడు తాదాత్మ్యం పొందుతూ ఉంటాడు, దానిమీద ఈగలు వాలనివ్వడు, వాళ్ళకి కావలసిన వాళ్ళు ఏదైనా చిన్నమాట అన్నా పడరు, వాళ్ళ శ్రేయస్సు కోరే వాళ్ళు ఏదైనా మాట అన్నా పడరు. కొంతమంది అయితే మీరు పెట్టడానికి పనికొస్తారు కానీ తిట్టడానికి పనికిరారు అని అర్థం అయ్యేలా ముఖం మీదే చెప్పేస్తున్నారు. అయితే ఈ రూపం వాళ్ళ అహంభావనని పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది. అంటే రూపం మనకి మంచి చేస్తోందా? చెడ్డ చేస్తోందా? రూపం అంటే ఇక్కడ అందం అని కాదు, ఆకారం అన్నమాట. నీ శరీరాన్ని జ్ఞానం సంపాదించుకోవడానికి ఉపయోగించుకో, కానీ నువ్వు ఏమి చేస్తున్నావు? నీ అహంభావాన్ని పెంచుకోవడానికి ఉపయోగించు కుంటున్నావు. ఇప్పుడు ఎదుటి వాళ్ళు మీకు ఏదో కబుర్లు చెబుతున్నారు అనుకోండి, వాళ్ళు ఇలా విమర్శిస్తున్నారు, వీళ్ళు అలా విమర్శిస్తున్నారు అని చెపుతున్నారు అనుకోండి ఆ అక్కర్లేని కబుర్లు మీరు బాగా వింటున్నారు అనుకోండి, బాగా శ్రవణం చేస్తున్నారు అనుకోండి, దానివల్ల కూడా మీకు అహంభావన పెరిగిపోతుంది.

అందుచేత ఆచార్యుల వారు ఏమన్నారు అంటే ఒక్క ఆత్మానుభవం తప్పించి, ఆత్మ జ్ఞానం గురించి తప్పించి ఎవరు ఏది మాట్లాడినా I have no time to waste అనేవారు. మీతోటి బాతాకాని కబుర్లు చెప్పడానికి నాకు టైం లేదు అనేవారు ఆచార్యస్వాములవారు. I have no time to waste. అంటే జ్ఞానం తప్పించి మిగతా మాటలు ఏవి వచ్చినా వాటిని తోసేసేవారు, I have no time to waste. అంటే కాలాన్ని మనం అగౌరవపరిస్తే దేవుడిని కూడా అగౌరవపరచినట్టే, ఎందుకంటే కృష్ణుడు కూడా గీతలో నేను కాల రూపంలో

ఉన్నాను అని చెప్పాడు. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నీ శత్రువు ఎవరూ కాదు, నీ అహంభావనే నీకు శత్రువు. అహంభావన అనే మొసలి నిన్ను పట్టుకుంది, ఆ మొసలి నిన్ను విడిచిపెట్టకపోతే నీకు మోక్షం ఇంక రాదు. లోపల అజ్ఞానం తోటి ఏ రూపంలో నీకు సంబంధం ఉన్నా నీకు ఇంక మోక్షం రాదు. బాహ్యంగా చేసే జిమ్మిక్కులకి, గమ్మత్తులకి మోక్షం రాదు. లోకంలో ఎన్ని రోగాలు ఉన్నాయో అన్ని రోగాలు ఒక మనిషికి రానక్కర్లేదు. ఏదో ఒక రోగం వల్ల చనిపోతాడు అంటే కిల్లర్ డిసీస్ ఒకటి వచ్చినా చనిపోతాడు. అంతేకానీ వంద రోగాలు రానక్కర్లేదు. అదేవిధంగా నువ్వు పాడైపోవటానికి నీ లోపల ఉన్న అహంభావన తోటి ఏదో ఒక రకమైన సంబంధం ఉన్నా సరిపోతుంది, అన్ని సంబంధాలు ఉండక్కర్లేదు. ఒక్క సంబంధం ఉన్నా ఆ సంబంధం ఏ రూపంలో ఉన్నా, అంటే అహంభావన తోటి నీకు ఉన్న సంబంధం, అజ్ఞానం తోటి నీకు ఉన్న సంబంధం ఏ రూపంలో ఉన్నా నువ్వు పతనం అయ్యిపోతావు.

బాహ్య ప్రక్రియల వలన మేము నుంచున్నాం, కూర్చున్నాం అంటే అజ్ఞానం పోదు. అది ఎక్కడుంది? లోపల ఉంది, అది వేరుతో సహా నశించాలి. అది ఈ జిమ్మిక్కుల వల్ల, ఈ గమ్మత్తుల వల్ల పోయేది కాదు. చర్మంపైన మేము కొబ్బరి నూనె రాసుకున్నాం అంటే అహంభావన పోతుంది అనుకోకండి, అహంభావన లోపల ఉంటుంది, సర్జరీ పడవలసిందే అక్కడ. మేము కొబ్బరి నూనె రాసుకుంటున్నాం అంటే రాసుకోండి మంచిదే దానివల్ల చెడ్డ ఏమీ జరగదు, చర్మం మీద ఏదైనా దురద ఉంటే తగ్గుతుంది. అంతేకానీ లోపల అహంభావన పోదు అంటున్నారు ఆచార్యుల వారు చెప్పేది అది. బాహ్య ప్రక్రియల వల్ల పోయేది కాదు అది. పోనీ డాక్టరు దగ్గరకి వెళ్లి ఏదైనా ఆపరేషన్ చేయించి తగ్గించుకుందాం అంటే దానికి

**మీ కుటుంబసభ్యుల పట్ల మమకారం లేకుండా డ్యూటీ చేస్తుంటే అది కూడా వైరాగ్యంతో సమానం.**



రూపం లేదు అంటున్నారు. పోనీ దానికి రూపం లేదని అలా పడి ఉంటుందా అంటే ఏదో ఒక రూపాన్ని పట్టుకుని ఊరేగుతూ ఉంటుంది. పుట్టినది మొదలు చనిపోయే వరకు ఏదో ఒక రూపాన్ని పట్టుకుని ఏడ్చినా ఫరవాలేదు, ఒకే రూపాన్ని పట్టుకోదు, పుట్టినది మొదలు చనిపోయేవరకు అలా రూపాలు మారుస్తునే ఉంటుంది. మొత్తం మీద ఏదో ఒక రూపాన్ని పట్టుకొని ఉండాలి, అది మీరు గ్రహించవలసినది, అదే మాయ.

రూపం లేకుండా అది ఉండలేదు, రూపాన్ని పట్టుకుని ఎందుకు ఉంటుంది అంటే రూపం లోంచి దానికి ఆహారం అందుతుంది. అన్నం తింటే మన శరీరానికి ఏవిధంగా అయితే బలం ఉంటుందో, ఆ రూపచింతన వల్ల దానికి ఫుడ్ సప్లై అవుతుంది. అహంకారానికి రూపం లేదు, అది రూపం లేని పిశాచం. రూపం లేనిది రూపం లేనట్టు అలా పడి ఉండదు, రూపాలని పట్టుకుంటుంది. ఒక రూపం పట్టుకుని అలా ఉండదు. కొంతకాలం తరువాత రూపాలని కూడా మారుస్తూ ఉంటుంది. మన శరీరం చనిపోయింది అనుకోండి, కొత్త శరీరం ఏదో వస్తుంది కదా దానిని పట్టుకుంటుంది. మళ్ళీ ఆ శరీరం కొంతకాలానికి చనిపోతుంది. ఎంతకాలం ఉంటుంది ఆ శరీరం? ఇనుప పెట్టెలో దాచి ఉంచుతాం అనుకోండి, ఉంటుందా? మళ్ళీ ఇంకో కొంతకాలం ఉంటే ఆ శరీరం చనిపోతుంది. ఏ రూపం వచ్చినప్పుడు ఆ రూపం తోటే తాదాత్మ్యం చెందుతూ ఉంటుంది. అది ఒక్కటే నిజం అని మనకు అనిపిస్తూ ఉంటుంది. ఈ అజ్ఞానం లోంచి, కర్మ సముద్రం లోంచి, ఈ అజ్ఞానసముద్రం లోంచి నువ్వు బయటకి రావాలి అంటే కేవలం నీ తెలివి తేటల వల్ల బయటకి రాలేవు. ఏ గురువు అనుగ్రహమో, ఏ అవతార పురుషుడి అనుగ్రహమో ఉంటేనే కానీ ఈ మహా సముద్రం నుంచి నువ్వు బయటకి రాలేవు. ఒకటి ప్రేమ, రెండు ఏకాగ్రత, ఇవి రెండు మనం సంపాదించాలి. బజారులో ఉన్న వస్తువులని కొనుక్కోవడానికి మన దగ్గర పైసలు ఎలా ఉండాలో, అలాగే బ్రహ్మానుభవం సంపాదించడానికి ఒకటి ప్రేమ, రెండు ఏకాగ్రత. ఇవి రెండూ ఉండాలి. దైనందిన జీవితంలో నువ్వు చేసే పనే ప్రేమగా చెయ్యి, ఏకాగ్రతతో చెయ్యి, ఇష్టంగా చెయ్యి, నీకు జ్ఞానం కలుగుతుంది.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**నాదత్తే కస్యచిత్ పాపం న చైవ సుకృతం విభుః ।**

**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥ 05-15॥**

**తాత్పర్యము :** సర్వవ్యాపియైన భగవంతుడు ప్రాణుల పుణ్యపాప కర్మలలో దేనికిని భాగస్వామి కాడు. అజ్ఞానముచే జ్ఞానము కప్పబడియుండుట వలన ప్రాణులు మోహితులగుచుందురు.

విభుః అంటే వ్యాపించినవాడు. అంతటా ఉన్నవాడు, సర్వజ్ఞుడు. ఈ సృష్టిలో ఎక్కడ ఏం జరిగినా ఆయనకి తెలియకుండా జరగదు. మీ జీవితంలో జరిగేవి అన్నీ ఆయనకి తెలుస్తూనే ఉంటాయి. అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లోను ఉన్నవాడు, వికారాలు ఆకారాలు లేనివాడు. ఈ లోకానికి ప్రభువు, కానీ ఈ లోకానికి నేను ప్రభువుని అని ఆయన అనుకోవడం లేదు. అనుకోవడానికి అక్కడ కర్తృత్వం లేదు. నీ పాపాన్ని గ్రహించను,

నీ పుణ్యాన్ని గ్రహించను, ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలలో కూడా ఏది గ్రహించను. నీ పుణ్య పాపాల తోటి, ఈ చావు పుట్టుకల తోటి నాకు ఏమీ సంబంధం లేదు అంటున్నాడు.

అహంకారం ఉన్నవాడికి మిత్రులు శత్రువులు ఉంటారు. నాకు మిత్రులు లేరు, శత్రువులు లేరు. నాకు పుణ్యం లేదు, పాపం లేదు. ఎందుచేత అంటే కర్తృత్వం అక్కడ లేదు. పూర్వం మీ స్నేహితులు ఇప్పుడు విరోధులు అయ్యిపోవచ్చు, విరోధులు స్నేహితులు అయ్యిపోవచ్చు. ఇది మానవతా సంబంధం కాదు వ్యాపార సంబంధం. ఎదుటివాడి వల్ల మనకి ఏమీ కలిసిరాదని తెలిసి వాడికి చేసిన సహాయమే పుణ్యం. నువ్వు ఎవరికైతే దానం చేశావో వాళ్ళ దగ్గర నుంచి ఏదో ఆశించి చేస్తే అది వ్యాపారం అవుతుంది కానీ పుణ్యంలోకి రాదు.

ఇక్కడ కృష్ణుడు ఏమి చెబుతున్నాడు అంటే నాకు నీ పుణ్యం అక్కర్లేదు, నీ పాపం అక్కర్లేదు. నీ మంచి అక్కర్లేదు, నీ చెడ్డ నాకు అక్కర్లేదు. నీ ప్రవృత్తిని బట్టి, నీ వాసనని బట్టి, నీ గుణాన్ని బట్టి, నీ తలంపుని బట్టి, నీ పరిస్థితులని బట్టి నీ తిప్పలు నువ్వు పడుతున్నావు, వాటితో నాకు సంబంధం లేదు. ఈ ప్రకృతి గొడవలకి, ఈ చావటాలకి, పుట్టటాలకి నాకు సంబంధం ఏమిటి అంటున్నాడు. అన్నీ మీరే చేసి దేవుడు ఇలా చేశాడు అంటున్నారు, మంచి చేస్తే మీకు పుణ్యం వస్తుంది, పాపం చేస్తే మీకు దుఃఖం వస్తుంది. దేవుడు మిమ్మల్ని పాపం చెయ్యమని చెప్పాడా? మాయ చేసేస్తుంది ఇదంతా. కర్మఫలం కూడా ప్రకృతే చేసేస్తుంది మీకు. ఈ ప్రకృతిని దాటితే కదా నా స్వరూపాన్ని మీకు ఇచ్చేది అంటున్నాడు.

ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క రకమైన వాసన ఉంటుంది. ఆ వాసన బట్టి దేహం వస్తుంది. మీ వాసనకి సంబంధించిన పనే నీకు ప్రకృతి ఇస్తుంది. ఎవడి వాసనని వాడే పూజించుకుంటున్నాడు, ఎవడి కర్మని వాడే కల్పించుకుంటున్నాడు, నేనేమి కల్పించుకోమని చెప్పడం లేదు. మీ వాసనలకి అలవాట్లకి అనుగుణంగా మీరు పని చేస్తున్నారు. ఎవరి వాసన బట్టి మాయ వాడికి ఆ పని అప్పజెపుతుంది, కానీ వాటితో నాకేమి సంబంధం లేదు. నీ కర్మ తోటి నాకు సంబంధం లేదు, నీ పుణ్యపాపాల తోటి, చావుపుట్టుకల తోటి నాకు సంబంధం లేదు, నీ శరీరం రంగుతోటి నాకు సంబంధం లేదు. ఐయాం ఎబవ్ ఆల్

దీజ్ తింగ్స్ (I am above all these things). కానీ ఆయన ఎక్కడో మనల్ని విడిచిపెట్టేసి లేడు, మన స్వరూపంగానే ఉన్నాడు!

ప్రకృతి నుండి బయటకి రావడానికి కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం, ఏదో యోగం అవలంభించండి. ఒక గురువునో, దేవుడినో ఆశ్రయించండి. నావ మీద దాటినా, లాంచి మీద దాటినా, మాములు పట్టి మీద దాటినా నది దాటాలి కదా, అలా ఏ దేవుడిని ఆశ్రయించినా ముందు అసలు ప్రకృతిని దాటి బయటకు రండి అంటున్నాడు కృష్ణుడు. నన్నే ఆశ్రయించండి, నన్నే పూజించండి అని చెప్పటం లేదు.

మీరు ఉన్నారు అని తెలియడానికి మీకు అద్దం అక్కర్లేదు, భగవద్గీత వేదాలు అక్కర్లేదు. దీనికి తెలివితేటలు అక్కర్లేదు, కామన్‌సెన్స్ ఉంటే చాలు. వేదాలు చదువుకుంటే పాండిత్యం వస్తుంది, సన్మానాలు చేస్తారు. ఈ సన్మానాలు, ఈ ఊరేగింపులు అన్నీ దేహము ఎంత నిజమో అవి అంతే నిజం. నేను అనే తలంపు నీకు లోపల నుంచే వస్తుంది. దాని మూలం నీ హృదయంలో ఉంది. అది ఎక్కడ నుంచి వస్తోందో అక్కడ వెతికితే నువ్వు ఎవరో నీకు తెలుస్తుంది, పుస్తకంలో వెతికితే తెలియదు.

కృష్ణుడు చెప్పే టెక్నిక్ ఏమిటంటే, మీకు ఎవరికైనా దుఃఖం వస్తే, నా దేహంలో ఈ ప్రారబ్ధం ఉంది కాబట్టి నేను దుఃఖం అనుభవిస్తున్నాను అని మీరనుకోవడం లేదు. బయట ఎవరో కారణం మీకు కనిపిస్తున్నారు. అదే మాయ అంటున్నాడు కృష్ణుడు. ఆ బయట కారణం వల్ల వాళ్ళమీద మీకు విరోధం వస్తుంది, ద్వేషం వస్తుంది, దాని వలన కొత్త వాసనలు వస్తున్నాయి. మాయలో ఉన్నవాళ్ళు అందరూ సంసారులే, వీరు లోకాన్ని చూసి మోహపడుతున్నారు. ఈ ప్రకృతిలో ఉన్నవాళ్ళు లోకాన్ని చూసి మోహపడుతున్నారు. ఏ అజ్ఞానం వల్ల వాడు మోహపడుతున్నాడో ఆ అజ్ఞానం తొలగిపోతే మోహం నశిస్తుంది, వెంటనే ఉన్న వస్తువు ఉన్నట్టుగా వ్యక్తమవుతుంది. నీ లోపల జ్ఞానం ఉంది, నీ లోపల దేవుడు ఉన్నాడు, నీ లోపల ఆత్మ ఉంది, నీ లోపల ప్రకాశం ఉంది, నీ లోపల వైకుంఠం ఉంది, నశించని వస్తువు నీ లోపలే ఉంది. ఈ శరీరం ఉండగానే ఆ వస్తువు తాలుకు

సుఖాన్ని, శాంతిని నువ్వు పొందవచ్చు.

దేవుడు మన స్వరూపంగానే ఉన్నప్పటికీ, మనకి తెలియకపోవడం వల్ల ఆయన లేడు అనుకొంటున్నాం. మీ అందరి హృదయాలలోను నేను ఉన్నాను, అయితే నన్ను మీరు తెలుసుకోవడానికి నేనేమి మీకు అడ్డురావడం లేదు, మీ అజ్ఞానమే మీకు అడ్డు వస్తోంది అంటున్నాడు కృష్ణుడు. మీ లోపల ఉన్న అజ్ఞానం తొలగించుకోవడానికి మీ మాట, చేత సహకారం చెయ్యాలి, అదే సాధన. అది తొలగిపోతే ఆ ఉన్నవాడు ఎవడో మీకు వ్యక్తం అవుతాడు. అయితే దానిని నీ అంతట నువ్వు తొలగించుకోలేవు. దానికి నువ్వు ప్రయత్నం ప్రారంభిస్తే భగవంతుడి సహకారం కూడా వస్తుంది. నాకు ఇష్టమైన పని చెయ్యి, నాకు ఇష్టమైన మాటలు మాట్లాడు, నన్ను జపించు, నన్ను స్మరించు, నిరంతరం నాకోసమే నువ్వు జీవించు, నాకోసమే నువ్వు పనిచెయ్యి. అలా చేస్తూ, నువ్వు రవ్వంత నీ అజ్ఞానాన్ని పోగొట్టుకోవడానికి ప్రయత్నం చేస్తే, నా అనుగ్రహం వల్ల ఆ అజ్ఞానం ఊడిపోతుంది అంటున్నాడు భగవంతుడు.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో జరుగు కార్యక్రమములు

దిIl 13-03-2026 శుక్రవారం సద్గురు శ్రీనాన్నగారి విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవము





# ద్వంద్వాలు

సద్గురుని అనుగ్రహం వల్ల ఒక్కో సందర్భములో శాంతికి లోనవుతూ ఉంటాము, కానీ ఆ శాంతి ఎంతోసేపు నిలవదు, మళ్ళీ ద్వంద్వాల వలయములోకి వచ్చేస్తాం. సుఖము-దుఃఖము, మంచి-చెడు, ఇష్టం-అయిష్టం వంటి ద్వంద్వాల చక్రంలో తిరుగుతూనే ఉంటాము. అట్టి తరుణంలో సుఖము వచ్చింది అంటే, దాని ప్రక్కనే దుఃఖము ఉంది అని అర్థం. ద్వంద్వాలలో ఏదీ స్థిరముగా ఉండదు. ద్వంద్వాలలో ఎంపిక ఉంటే అది అజ్ఞానానికి గుర్తు. కానీ మనము ద్వంద్వాలలో ఒక దానిని మాత్రమే ఎంపిక చేసుకుంటాం, కోరుకుంటాం. ఉదాహరణకు సుఖము ఇష్టము మంచి లాంటివి, అనగా మనము ఎప్పుడూ ఇష్టమైన వాటిని, అనుకూలమైన వాటిని మాత్రమే కోరుకుంటాం. అయిష్టమైన వాటిని, ప్రతికూలమైన వాటిని వద్దనుకుంటాం. ద్వంద్వాలు పుట్టుకతోనే విడదీయరాని కవల పిల్లల లాంటివి, ఒకటి లేకుండా రెండవది ఉండదు. మరి ద్వంద్వాలను అతిక్రమించే మార్గము ఏమిటి అన్న ప్రశ్న ఉదయించినప్పుడు ద్వంద్వాలు అసలు ఎవరికి? అట్లే ద్వంద్వాలు తీసుకొచ్చే సుఖ-దుఃఖాలు అనుభవించే నేను ఎవరు? అన్న విచారణ చేయమంటారు భగవాన్. నేను నేనుగా ఉండాలంటే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందాలి. దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందడానికి చేసే ప్రయత్నమే, నిజమైన ప్రయత్నము. సమస్యలు, అశాంతి, దుఃఖము మున్నగువాటికి తాత్కాలిక పరిష్కారం వెదకడం కాకుండా; అసలు అవి ఎవడికి కలుగుతున్నాయో వాడిని విచారించి పరిష్కరించుకోవాలి. మనము కర్తృత్వబుద్ధిలో బలంగా వ్రేళ్ళూని ఉన్నాము. అహంకారమే మన స్వీయాభివృద్ధికి అడ్డువస్తోంది. సద్గురునికి శరణాగతి చెందడానికి అసమర్థులుగా ఉన్నాం. నీడలాంటి అస్థిత్వం లేని అహంకారం మనలను బానిసలుగా ఆడిస్తోంది. నేను అను మొదటితలంపుకే ప్రాపంచిక సుఖాలు కావాలి. ద్వంద్వానుభూతులు అట్లే త్రిపుటి అన్నీ మనస్సులే. ఆ మనస్సే నశిస్తే మిగిలేది ఏకత్వమే. "మనస్సు సహజంగా విషయాల వైపుకు పరుగెడుతుంది అది అంతే సహజముగా దాని మూలములో నిలబడడానికే సాధన. వాస్తవంగా తాను ఎవరో అనుభవమయ్యే వరకు, మాయ మనిషిని విడిచిపెట్టదు. యదార్థముగా తానెవరో తెలియకపోవడమే మాయ" అన్నది సద్గురు శ్రీనాన్నగారి ఉవాచ.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**